సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 26 । అక్టోబర్ । 2024



బ్రహ్మోత్సవం.. కనుల వైభవం

కోనసీమ తిరుపతిగా ఖ్యాతి కెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.


10లో



మద్యం దుకాణాలపై ప్రజాగ్రహం

కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన మద్యం పాలసీ ద్వారా దుకాణాల ఏర్పాటుకు లైసెన్సులు జారీ చేశారు. ఎక్కడైనా దుకాణాలు పెట్టుకోవచ్చనే నిబంధన ఉండడంతో జనావాసాల మధ్య ఏర్పాటు చేసేందుకు లైసెన్సుదారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

86 వేల క్యూసెక్కుల జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం సాయంత్రం 86,182 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ వద్ద 10.90 అడుగులకు నీరు చేరింది. డెల్టా కాలువలకు 9,500 క్యూసెక్కులను వదిలారు. తూర్పు డెల్టాకు 2,500, మధ్య డెల్టాకు 2,000, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కులను వదిలారు.

ఫుల్ కిక్కు



కాట్రేనికోనలో మద్యం షాపు, అనధికార పర్మిట్ రూమ్‌లో మద్యం తాగుతున్న మందుబాబులు



బెల్టు షాపులో జరుగుతున్న మద్యం అమ్మకాలు



అమలాపురం మండలం బండారులంకలో బెల్టుషాపు

- మద్యం దుకాణాలకు అదనంగా బెల్టుషాపులు
- చక్రం తిప్పుతున్న టీడీపీ నేతలు
- నిబంధనలకు చెల్లు చీటీ
- దుకాణాల వద్దే అనధికార పర్మిట్ రూమ్‌లు
- అధిక ధరలకు మద్యం విక్రయాలు

సాక్షి, అమలాపురం/ కాట్రేనికోన: కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోంది. ప్రభుత్వ మద్యం విధానం మూడు దుకాణాలు.. ఆరు బెల్టు షాపులుగా వర్ధిల్లుతోంది. ప్రభుత్వ టెండర్లలో మద్యం షాపులు దక్కించుకున్న వ్యాపారులు సిండికేటు రింగులోకి రావడంతో బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటిని అడ్డంపెట్టుకుని అధిక ధరలకు మద్యం విక్రయాలు చేస్తున్నారు. సిండికేటులో చక్రం తిప్పుతున్న తెలుగు తమ్ముళ్లు తమ పార్టీకి చెందిన వారు అడిగిందే తడవుగా దుకాణాలకు అనుమతి ఇచ్చేస్తున్నారు. సాధారణ అమ్మకాల కన్నా బెల్టు అమ్మకాలు అధికంగా ఉండడం, పైగా వీటిలో క్వార్టర్ బాటిల్‌ను రూ.20 నుంచి రూ.30కి పెంచి అమ్ముకునే సౌలభ్యం ఉండడంతో మరిన్ని పెట్టేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. తద్వారా భారీగా ఆదాయం సంపాదించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

జిల్లాలో 133 మద్యం దుకాణాలు

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జిల్లాలో 133 మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. వీటి పరిధిలో ఒక్కొక్క దుకాణానికి అనుబంధంగా పది నుంచి 20 వరకు బెల్టుషాపులు ఉంటాయని అంచనా. బెల్టు ఏర్పాటుపై ఇప్పటికే సగానికి పైగా లక్ష్యానికి చేరుకున్నారు. మద్యం దుకాణాలతోపాటు అమ్మకాలు అధికంగా ఉన్న బెల్టుషాపుల ఏర్పాటుపై నేరుగా ఎమ్మెల్యేలు తలదూర్చుతుండడం గమనార్హం.

- అమలాపురం నియోజకవర్గంలో 18 షాపులున్నాయి. వీటిని అనుబంధంగా దాదాపు 200 బెల్ట్ షాపులు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతానికి 135 వరకు బెల్టులకు సిండికేట్లతో ఒప్పందం కుదిరింది. మిగిలిన వాటికి బేరసారాలు సాగుతున్నాయి. ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల్లోని తీర గ్రామాల్లో ఎంఆర్పీ కన్నా రూ.పదికి పెంచి అమ్మకాలు చేస్తున్నారు. పాత స్టాక్‌లో చీఫ్ క్వార్టర్ ధర రూ.150 వరకు ఉంటోంది.
- పి.గన్నవరం నియోజకవర్గంలో ఇప్పటికే 150 వరకు బెల్టు షాపులు ఏర్పడ్డాయి. మరిన్ని బెల్టులకు ఆయా దుకాణాల యజమానులు, సిండికేటు దారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వీటి ద్వారా ఎంఆర్పీ కన్నా రూ.20 నుంచి రూ.30 అధిక ధరలకు మద్యం విక్రయాలు చేస్తున్నారు.
- మండపేట నియోజకవర్గం పరిధిలోని రాయవరం మండలంలో అడిగిన వారికి కాదనకుండా బెల్టుషాపులు ఇస్తున్నారు. రాజోలు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 120కి పైగా బెల్టులున్నాయి. ఇక్కడ కూడా ఎంఆర్పీ నిబంధనకు చెల్లుచీటి ఇచ్చి అదనపు ధరలకు మద్యం విక్రయాలు చేస్తున్నారు.
- రామచంద్రపురం నియోజకవర్గంలో మద్యం దుకాణదారులు సిండికేటుగా మారారు. ఐదు నుంచి ఆరు బెల్టుషాపుల వరకూ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఒక్కొక్క బెల్టు షాపు వద్ద నుంచి రూ.రెండు లక్షల వరకు డిపాజిట్ చేయాలని చెబుతున్నారు. పోలీసులు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారుల బాధ్యతను సిండికేటు చూసుకునేలా ఒప్పందం కుదిరింది.
- కొత్తపేట నియోజకవర్గంలో 25 మద్యం షాపులుండగా, ఇప్పటి వరకు వంద బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. ఎమ్మార్పీ రేటు కంటే రూ.10కి పెంచి విక్రయిస్తున్నారు. రూ.130 క్వార్టర్ బాటిల్‌ను రూ.150కి, అలాటే 180 బాటిల్‌ను రూ.220కి అమ్ముతున్నారు.
- ప్రభుత్వం నుంచి పర్మిట్ రూమ్‌కు అనుమతులు లేకున్నా అనధికారికంగా ప్రతి షాపు పక్కనే ఒక పర్మిట్ రూమ్‌ను తెరుస్తున్నారు. కొన్నిచోట్ల పర్మిట్ రూమ్‌లకు నిర్మాణాలు చేస్తున్నారు. వీటిలో మందుబాబులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు.

బెల్టు షాపులకు వేలం

మద్యం దుకాణాలకు ప్రభుత్వం లాటరీ వేస్తే.. టీడీపీ నేతల కనుసన్నల్లో తీరంలోని పలు గ్రామాల్లో బెల్టుషాపులకు వేలం నిర్వహించడం గమనార్హం. జిల్లాలోని తీర ప్రాంత మండలాలైన సఖినేటిపల్లి నుంచి ఐ.పోలవరం వరకు మత్స్యకార గ్రామాల్లో ఇదే పందా నడుస్తోంది. గతంలో వేలం నిర్వహించిన బెల్టు షాపులు కొనసాగుతుండగా, కొత్తగా మరికొన్ని ప్రాంతాల్లో వేలం పాటలు నిర్వహించి స్థానిక వ్యాపారులకు అప్పగించారు.

- ముమ్మిడివరం నియోజకవర్గంలోని కాట్రేనికోన మండలం చిర్రయానాంలో బెల్టు షాపు విక్రయాలకు ఏడాదికి రూ.9.75 లక్షలకు పాడుకున్నారు. గొల్లగరువులో దుకాణాన్ని రూ.1.25 లక్షలకు, దొంతుకుర్రుకు రూ.2.30 లక్షలకు పాడుకోవడం గమనార్హం.
- నెలవారీ చెల్లించేందుకు పల్లం, బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటిమొగ, పోర, రాజానగరం, నీళ్లరేవుల్లో అంతర్గత ఒప్పందాలతో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు.
- ఐ.పోలవరం మండలం భైరవపాలెంలో నెలకు రూ.1.61 లక్షల వరకు వేలం పాట జరిగిందని సమాచారం.
- అమలాపురం నియోజకవర్గం ఉప్పలగుప్తం మండలంలో ఎస్.కొత్తపల్లి, వాసాలతిప్పలోని రెండు, మూడు బెల్టులకు వేలం నిర్వహణకు సిద్ధమవుతున్నారు.
- అల్లవరం మండలం నక్కా రామేశ్వరంలో రూ.6 లక్షలకు, బెండమూర్లంక పరిధిలో రెబ్బనపల్లి శివారులో రూ.2.85 లక్షలకు వేలం జరిగింది.

పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మహేష్ కుమార్, జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా నిర్వహించాలని అబ్కారీ, భూగర్భ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా జిల్లా స్థాయి ఇసుక కమిటీలకు సూచించారు. ఆయన శుక్రవారం రాత్రి అమరావతి నుంచి జిల్లా కమిటీ సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత ఇసుక పాలసీ 2024పై దిశా నిర్దేశం చేశారు. ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ జూలై 8న ఉచిత ఇసుక పాలసీ అమల్లోకి వచ్చిందని, అప్పటి నుంచీ క్యాబినెట్ సబ్ కమిటీ పలు సవరణలు చేయడం జరిగిందన్నారు. సవరించిన పాలసీ ప్రకారం సీనరేజ్, డీఎంఎఫ్ మెరిట్ నిధులను ఇకపై చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పంచాయతీల పరిధిలో వాగులు, వంకలలో ఇసుకను గ్రామపంచాయతీ అనుమతితో తీసుకువెళ్లవచ్చునని స్పష్టం చేశారు. అక్రమంగా రవాణా చేస్తే మాత్రం వాహనాల సీజ్ చేయడంతో పాటు పీడీ యాక్ట్ సైతం అమలు చేస్తామన్నారు. ప్రజలు తమ గృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుకను సొంతంగా ట్రాక్టర్ల ద్వారా తీసుకువెళ్లవచ్చునని, దానికి ఎటువంటి అభ్యంతరాలు ఉండవన్నారు. నదీ తీర గ్రామాల్లోని ప్రజలు సచివాలయాల్లో, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా బుక్ చేసుకుని ఉచితంగా ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకెళ్లే సదుపాయం కల్పించారన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవోలు శ్రీకర్ కె.మాధవి, కత్తిబ్ కౌసర్ భానో, గనుల శాఖ అధికారి బి.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయాలి

అమలాపురం రూరల్: జాతీయ రహదారులు, రైల్వే లైన్ల ఏర్పాటుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలు మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి అన్నారు. ఆమె శుక్రవారం జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలతో అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాలలో జాతీయ రహదారులు, బైపాస్ రోడ్లు, రైల్వే లైన్ల ఏర్పాటుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలపై సమీక్షించారు.

న్యూస్‌రీల్

బడిఈడు పిల్లలు స్కూళ్లలోనే ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ మధుసూదనరావు

అల్లవరం: బడిఈడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్షా ఏపీసీ మధుసూదనరావు అన్నారు. అల్లవరం మండల రిసోర్సు కార్యాలయంలో శుక్రవారం మన బడి మన భవిష్యత్ పథకంపై సమావేశం నిర్వహించారు. ఈ పథకం ద్వారా నిర్మాణంలో ఉన్న భవనాలపై సమీక్షించి, పురోగతిపై మండల జేఈ బాషా, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆరా తీశారు. పాఠశాల భవనాలను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రతి విద్యార్థికి అపార్ నంబర్‌ను కేటాయించాలని ఉపాధ్యాయులకు ఆదేశాలిచ్చారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని, నిర్వాహకులు శుభ్రత పాటించేలా ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎల్ఎస్ రమేష్ బాబు, ఏఎంఓ భీమారావు, ఎంఈఓ ఏడుకొండలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం సందర్శన



మాచవరంలో భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ సత్యనారాయణ

అంబాజీపేట: దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఐఈ కో ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. మాచవరంలోని భవిత కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రానికి వచ్చే దివ్యాంగులను ప్రేమతో సాకాలని, వారికి అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. ప్రతి బుధవారం కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని వినియోగించుకునేలా దివ్యాంగుల తల్లిదండ్రులను చైతన్యపరచాలన్నారు. అనంతరం కేంద్రం, విద్యార్థుల రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఐఈఆర్పీఎస్ ఎస్‌కే బేగం, ఎం.ఆశ ఉన్నారు.

వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత సాయిరామ్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో లక్ష్మీనారాయణ

ఐ.పోలవరం: హైదరాబాద్ చెందిన మాచిరాజు వెంకట సత్య సర్వేశ్వర సాయిరామ్ అనే భక్తుడు శుక్రవారం వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు శుక్రవారం రూ.లక్ష విరాళం అందించారు. ప్రస్తుత ఆలయ కార్యనిర్వహణాధికారిగా పనిచేస్తున్న మాచిరాజు లక్ష్మీనారాయణకు ఆయన స్వయానా సోదరుడు. సాయిరామ్ గతంలో ఆలయానికి రూ.నాలుగు లక్షల విలువ చేసే జనరేటర్, రూ.4.50 లక్షలతో అభిషేక మండపం టైల్స్ ఫ్లోరింగ్, రూ.3 లక్షలతో గణపతికి వెండి కవచం తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురమళ్ల వీరేశ్వరస్వామి అంటే తనకు అపారమైన నమ్మకమన్నారు. ఇక్కడ కల్యాణం జరిపించిన తర్వాతే తమ పిల్లలకు వివాహాలు జరిగాయన్నారు. అలాగే రాత్రి జరిగే నిత్య కల్యాణాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా రూ.నాలుగు లక్షల విలువైన ఎల్ఈడీ స్క్రీన్ అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ఆలయ మర్యాదలతో ప్రత్యేక దర్శనం చేయించారు. స్వామివారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందించారు.

ఆర్డీవోగా అఖిల



రామచంద్రపురం: ఆర్డీవోగా దేవరకొండ అఖిల శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె తాడేపల్లిగూడెం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. కాగా.. ఈ నెల 7వ తేదీన వైఎస్సార్ కడప జిల్లా నుంచి ఖాతిర్ కౌసిర్ భానో బదిలీపై వచ్చి ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించారు. అయితే మళ్లీ జరిగిన బదిలీల్లో ఆమె తాడేపల్లిగూడెం వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న అఖిల రామచంద్రపురం వచ్చారు.

దీపావళికి నిబంధనలు పాటించాలి

- ఉల్లంఘిస్తే కఠిన చర్యలే
- జిల్లా ఎస్పీ కృష్ణారావు



అమలాపురం టౌన్: ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. బాణసంచా తయారీ దారులు, విక్రేతలు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నెల 31వ తేదీన జరుపుకొనే దీపావళి సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను శుక్రవారం వివరించారు. బాణసంచా నిల్వ చేసే గోడౌన్ల నిర్వాహకులు, తయారీ, విక్రయాలు చేసే వారు లైసెన్సు కలిగి ఉండాలన్నారు. బాణసంచా నిల్వ కేంద్రాలు నివాస ప్రాంతాలకు నిర్దిష్ట దూరంలో ఉండాలని, లైసెన్సులో సూచించిన నిబంధనలు తప్పకుండా అనుసరించాలన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అక్కడ పనిచేసే సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. అధికారులు సూచించిన ప్రదేశాల్లోనే బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలని, ప్రతి దుకాణం వద్ద రెండు అగ్నినిరోధక సిలెండర్లు, రెండు బకెట్ల పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

నిరంతర తనిఖీలు, నిఘా

దీపావళి వరకూ పోలీసులు, మిగిలిన శాఖల సమన్వయంతో నిరంతరం తనిఖీలు చేయాలని ఎస్పీ బి.కృష్ణారావు సూచించారు. పోలీసు అధికారులు తమ పరిధిలో ఏర్పాటు చేసిన బాణసంచా తయారీ కేంద్రాలు, విక్రయ దుకాణాలు, నిల్వలు ఉంచిన గోడౌన్లలో నిత్యం ప్రత్యేక తనిఖీలు చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు జరుగుతున్నా, నిల్వ చేసినా ఆ సమాచారాన్ని పోలీసులకు అందించాలని ప్రజలను కోరారు. తద్వారా ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. 100, 112 లేదా జిల్లా స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్ 81437 92101కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

అనుమతి లేకుండా దుకాణాలు పెడితే చర్యలు

అమలాపురం రూరల్: అనుమతి లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీ సూచించిన ప్రదేశాలలో మాత్రమే దుకాణాల ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. ఈనెల 29 నుంచి 31వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే బాణాసంచా విక్రయించడానికి అనుమతి ఉందన్నారు. అధికారులు జారీ చేసిన తాత్కాలిక లైసెన్సులు పొందినవారు మాత్రమే బాణసంచా దుకాణాలు నిర్వహించాలన్నారు.

సెపక్ తక్రా పోటీల్లో జిల్లాకు రజత పతకం



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీ హరీష్ మాధుర్

అమలాపురం రూరల్: శ్రీకాకుళంలోని ఎన్‌టీఆర్ ఎంహెచ్ క్రీడా మైదానంలో ఈ నెల 22 నుంచి 23 వరకూ 34వ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా క్రీడా పోటీలు జరిగాయి. వీటిలో జిల్లా జట్టు అద్భుత ప్రదర్శన చేసి రజత పతకం సాధించింది. ఈ విషయాన్ని జిల్లా సేపక్ తక్రా క్రీడా అధ్యక్షుడు జవ్వాది తాతబాబు శుక్రవారం తెలిపారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లాకు పతకం తీసుకువచ్చిన క్రీడకారులు కేత సతీష్, పాటి సన్నీ, మోహన్ కృష్ణ, సుభాష్‌లను ఎంపీ గంటి హరీష్ మాధుర్ తన నివాసంలో అభినందించారన్నారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారన్నారు. అమలాపురంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాలని కోచ్ యాండ్ర గౌతమ్‌కు తెలిపారన్నారు.

29 నుంచి ఉచిత సిలిండర్ల పథకం

అమలాపురం రూరల్: ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చే పథకం అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. అమరావతి నుంచి పౌర సరఫరాల శాఖ కమిషనర్ జి.వీరపాండ్యన్, డీసీఎస్ మనజీర్ జిలాని శుక్రవారం జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, చౌకధరల దుకాణాల నిర్వహణ, ధరల నియంత్రణపై దిశానిర్దేశం చేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు ఈ నెల 29 నుంచి మార్చి 30వ తేదీలోపు ఒక సిలిండర్ బుక్ చేసుకోవాలన్నారు. దానికి డబ్బులను లబ్ధిదారుడే చెల్లించాలని, సిలిండర్ అతడికి అందిన తర్వాత అతడి ఖాతాలో ఆయిల్ కంపెనీ సబ్సిడీ జమచేస్తారన్నారు. ఈ సంవత్సరం ఒక సిలిండర్ పొందాక, ఆ వినియోగదారులకు వచ్చే సంవత్సరం మూడు బ్లాకుల్లో ఉచిత సిలిండర్లు అందజేస్తారన్నారు.

విద్యుత్ ఉపకేంద్రం పనుల పరిశీలన



విద్యుత్ కేంద్రం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

అయినవిల్లి: లోఓల్టేజీ సమస్యను అధిగమించి నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేసేందుకు సుమారు రూ.206 కోట్ల అంచనాతో చేపట్టిన 400 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మెగా ఇంజినీరింగ్ కాంట్రాక్టర్లను కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. అయినవిల్లి మండలం అయినవిల్లిలో నిర్మిస్తున్న 400 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రైతులు, పారిశ్రామికవేత్తలు, ఆక్వా రంగం, గృహావసరాలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నారన్నారు. రావులపాలెం నుంచి అయినవిల్లి వరకు సుమారు 36 టవర్లను నిర్మించి నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేసేందుకు అన్ని చర్యలు పటిష్టంగా చేపట్టాలన్నారు. ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రాజబాబు, డీఈలు పుల్లయ్య, రవి కుమార్, విజయానంద్ పాల్గొన్నారు.

రేపటి నుంచి సత్యదీక్షలు

- కార్తికమాసానికి రత్నగిరిపై విస్తృత ఏర్పాట్లు
- విభాగాల వారీగా ఈఓ పరిశీలన



ఆదివారం ప్రారంభించనున్న నూతన బస్సులు



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దేవస్థానం ఇంజినీరింగ్ సిబ్బంది

అన్నవరం: రత్నగిరిపై కార్తిక మాసోత్సవాలకు ఏర్పాట్లు చకచకా సాగిపోతున్నాయి. వచ్చేనెల ఒకటో తేదీతో ప్రారంభం కానున్న కార్తిక మాసానికి ముందు వచ్చే స్వామివారి జన్మ నక్షత్రం మఖ ఆదివారం రానుంది. ఈ సందర్భంగా ఆ రోజు తెల్లవారు జామున సత్యదేవుడు, అనంతలక్ష్మి, సత్యవతీదేవితో పాటు శంకరుల మూలవిరాట్‌లకు పంచామృత అభిషేకాలు చేస్తారు. అనంతరం సత్య దీక్షలను ప్రారంభించి నవంబర్ 23న వచ్చే మఖ నక్షత్రం రోజున దీక్ష విరమిస్తారు. 27 రోజులకు అవకాశం లేనివారు 18 రోజుల దీక్షకు ఆరో తేదీన, 9 రోజుల దీక్షకు 14వ తేదీన చేపడతారు.

ఆలయ ఈఓ కె.రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు ఇప్పటికే అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన అడ్డతీగల ఏజెన్సీలో పవనగిరి స్వామీజీ ద్వారా 600 జతల దీక్షా వస్త్రాలు, కాకినాడ జిల్లాలోని పలు గ్రామాల్లో మరో 400 మంది భక్తులకు దీక్షా వస్త్రాలను దేవస్థానం అధికారులు పంపిణీ చేశారు.

కార్తికానికి చురుగ్గా ఏర్పాట్లు

కార్తికమాసంలో స్వామివారి దర్శనానికి వచ్చే లక్షలాది భక్తుల కోసం ఆలయంలో వివిధ విభాగాల్లో జరుగుతున్న ఏర్పాట్లను ఈఓ పరిశీలించారు.

30న హుండీల లెక్కింపు

అదే విధంగా ఈ నెల 30వ తేదీన సత్యదేవుని హుండీలను లెక్కించనున్నారు. నెలకు ఒకసారి మాత్రమే లెక్కించే హుండీలను కార్తిక మాసంలో మాత్రం రెండుసార్లు లెక్కించడం ఇక్కడి ఆనవాయితీ.

పశ్చిమ రాజగోపురం వద్ద తాత్కాలిక విశ్రాంతి షెడ్డు

పశ్చిమ రాజగోపురం ఎదురుగా గల ఖాళీ ప్రదేశంలో గతంలో సత్యదేవ అతిథిగృహం ఉండేది. దానిని కూల్చివేసి దాని స్థానంలో భక్తుల విశ్రాంతి షెడ్డు నిర్మించాలని అనుకున్నప్పటికీ కారణాంతరాలతో ప్రస్తుతం తాత్కాలిక షెడ్‌ను నిర్మించనున్నారు. శుక్రవారం రాత్రి నుంచి షెడ్ నిర్మాణాన్ని ప్రారంభించనున్నారు.

రేపు సమన్వయ సమావేశం

కార్తిక మాస ఏర్పాట్లపై తుని, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు, ఆర్డీఓ తదితర శాఖల అధికారులతో పాటు, ఈఓ రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో ఆదివారం సమన్వయ సమావేశం జరగనుంది.

వర్షాలు పడినా సమస్య లేకుండా దేవస్థానం ఈఈ రామకృష్ణ, డీఈ రాంబాబు ఆధ్వర్యంలో ఐదు అడుగుల గోడ, దాని పక్కనే డ్రైను నిర్మిస్తున్నారు. అలాగే భక్తుల సౌకర్యార్థం ఇటీవల దేవస్థానానికి వచ్చిన బస్సులను ఆదివారం నుంచే ప్రారంభించనున్నట్టు ఈఓ తెలిపారు. రూ.80.6 లక్షలతో కొనుగోలు చేసిన రెండు బస్సులను రత్నగిరి–అన్నవరం రైల్వేస్టేషన్ మధ్య నడపనున్నట్టు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



అంబాజీపేటలో లక్ష్మీప్రసన్నను అభినందిస్తున్న హెచ్ఎం సాయిరామ్

అంబాజీపేట: రాష్ట్ర స్థాయిలో నిర్వహించే అథ్లెటిక్ 400 మీటర్ల రన్నింగ్ పోటీలకు అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కె.లక్ష్మీప్రసన్న ఎంపికైంది. ఈ విషయాన్ని హెచ్ఎం కడలి సాయిరామ్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 24న రాజమహేంద్రవరంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అథ్లెటిక్స్ 400 మీటర్ల రన్నింగ్ పోటీలలో లక్ష్మీప్రసన్న ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. లక్ష్మీప్రసన్నతో పాటు ఆమెకు శిక్షణ ఇచ్చిన పీడీ కె.ఆదిలక్ష్మిని హెచ్ఎం సాయిరామ్, వెన్నపు సత్యనారాయణ, బి.వెంకటేశ్వరరావు, బీఎస్ఎస్.మూర్తి, పీఈటీ అందె సూర్యకుమారి అభినందించారు.

షాట్‌ఫుట్ పోటీలకు..

అల్లవరం: దేవగుప్తం ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న గూడవల్లి రక్షిత రాష్ట్ర స్థాయి షాట్‌పుట్ క్రీడలకు ఎంపికైందని హెచ్ఎం వేణు గోపాల్ తెలిపారు. రాజమహేంద్రవరంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడల్లో అండర్ 14 విభాగంలో రక్షిత 7.7 మీటర్ల విసిరి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. పీడీ రాజ్‌కుమార్ శిక్షణలో ఇద్దరు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక కావడం విశేషమని హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముమ్మిడివరం: గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలేనికి చెందిన తాడాల దుర్గాప్రసాద్ (25) తల్లిదండ్రులతో కలిసి ముమ్మిడివరం పోలీసు క్వార్టర్స్ వెనుక వీధిలో ఉంటున్నాడు. వృత్తిరీత్యా ఆప్టింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడి సోదరి కూడా అనారోగ్యంతో పుట్టింటి దగ్గరే ఉండి వైద్య సేవలు పొందుతోంది. అయితే వైద్య చికిత్సకు డబ్బులు లేక తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. దుర్గాప్రసాద్ డబ్బులు ఇవ్వకపోవడంతో అతడిని మందలించారు. దీంతో ఈ నెల 23న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితికి చేరిన అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

240 కేజీల కల్తీ నెయ్యి స్వాధీనం



పిఠాపురంలో పట్టుబడిన కల్తీ నెయ్యి

పిఠాపురం: పిఠాపురంలోని ఇక ఇంట్లో కల్తీ నెయ్యిని తయారు చేస్తున్న ముఠాను అధికారులు పట్టుకున్నారు. అక్కడ 240 కేజీల కల్తీ నెయ్యిని, దాని తయారీకి ఉపయోగిస్తున్న సామాగ్రిని సీజ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ కనకారావు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు పిఠాపురం రోడ్డు నంబరు 2 పద్మావతి నగర్‌లోని బండారు ఫణిప్రసాద్ ఇంటిపై మున్సిపల్ అధికారులు దాడి చేశారు. అక్కడ ఆవు కొవ్వుతో తయారు చేస్తున్న నెయ్యిని గుర్తించారు.

బ్రహ్మోత్సవం.. నేత్రపర్వం

- ఘనంగా వాడపల్లి వెంకన్న ఉత్సవాలు
- గోవింద నామస్మరణతో మార్మోగిన కోనసీమ తిరుపతి
- మలయప్ప అలంకరణతో గరుడ వాహనసేవ
- భక్తులతో కిటకిటలాడిన ఆలయం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతి కెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి మలయప్ప అలంకరణతో గరుడ వాహనసేవ నిర్వహించారు. మేళతాళాలతో అంగరంగ వైభవంగా గ్రామంలో భారీ ఊరేగింపు జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. సుప్రభాతసేవ అనంతరం ఉదయం తీర్థపుబిందెతో గౌతమీ గోదావరి జలాలను తీసుకు వచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. గోత్ర నామాలతో పూజలు, నిత్యహోమాలు జరిగాయి. దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధరరావు స్వామివారికి పట్టువస్త్రాలను అందజేశారు. ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కాగా.. గరుడు వాహనంపై కొలువైన స్వామిని దర్శిస్తే బాధల నుంచి ఉపశమనం కలుగుతుందని భక్తుల నమ్మకం.



వేంకటేశ్వస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు



స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న ఆలయ ఈవో



ఆకట్టుకున్న కళాకారుల వేషధారణ

నేటి కార్యక్రమాలు

వేంకటేశ్వరస్వామికి శనివారం సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, విశేషార్చన, ప్రధాన హోమాలు, నీరాజన మంత్రపుష్పాలు, శ్రీకృష్ణ అలంకరణతో సూర్యప్రభ వాహన సేవ నిర్వహిస్తారు. సాయంత్రం స్వస్తి వచనం, ప్రధాన హోమాలు, నవగ్రహ హోమాలు, వేంకటేశ్వర హోమం, మోహిని అలంకరణతో చంద్రప్రభ వాహన సేవ జరపుతారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసిన ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

నేరాల అదుపునకు ప్రత్యేక బృందాలు

- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్
- తుని రూరల్ సర్కిల్ కార్యాలయంలో తనిఖీలు



తుని రూరల్ సర్కిల్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఐజీ అశోక్ కుమార్

తుని రూరల్: ఏలూరు రేంజ్ పరిధిలో నేరాలు అదుపు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఐజీ జీవీజీ అశోక్ కుమార్ తెలిపారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలసి శుక్రవారం ఆయన తుని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో వార్షిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఐజీ విలేకర్లతో మాట్లాడుతూ రేంజ్ పరిధిలో జాతీయ రహదారిని ఆసరా చేసుకుని ఏజెన్సీ, ఒడిశా ప్రాంతాల నుంచి సాగుతున్న గంజాయి అక్రమ రవాణా, ఈవ్ టీజింగ్, ఇతర నేరాలను నివారించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. జాతీయ రహదారిని అనుకుని ఉన్న దాబాలు, హోటళ్లలో చొరబడి దోపిడి, హత్యలకు పాల్పడే ముఠాలను పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా కాకినాడ జిల్లాలో ఎనిమిది వేల సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. అలాగే ప్రైవేట్ వ్యాపార సంస్థలు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. నేరాల దర్యాప్తు, నేరస్తులను పట్టుకోవడానికి సీసీ కెమెరాలు ఎంతో దోహదపతాయన్నారు. సోషల్ మీడియాలో పరిచయమయ్యే వ్యక్తుల కారణంగా కలిగే అనర్థాలపై మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు, సీఐలు జి.చెన్నకేశవరావు, గీతా రామకృష్ణ ఉన్నారు.

ప్రమాదవశాత్తూ కార్మికుడి మృతి

పిఠాపురం: షెడ్డు నిర్మాణం చేస్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడి కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పిఠాపురం మండలం కందరాడలో బాలాజీ రైస్ మిల్లులో షెడ్డు నిర్మాణం చేపట్టారు. రాయవరం మండలం పసలపూడి గ్రామానికి చెందిన పుట్టి వెంకట రమణ (36) అక్కడ పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం షెడ్డు నుంచి కాలుజారి కింద పడ్డాడు. అతడి తలకు రేకు బలంగా తగలడంతో తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పిఠాపురం రూరల్ ఎస్సై గుణశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు వెంకట రమణకు భార్య, పాప, బాబు ఉన్నారు. మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు

పి.గన్నవరం: ఎల్.గన్నవరం గ్రామంలో పక్షవాతంతో మంచాన పడిన వృద్ధురాలిపై ఈ నెల 23న జరిగిన లైంగిక దాడి కేసులో నిందితుడైన అదే ప్రాంతానికి చెందిన లంకే సత్యనారాయణను శుక్రవారం సీఐ ఆర్.భీమరాజు అరెస్టు చేశారు. ఈ విషయాన్ని ఎస్సై బి.శివకృష్ణ విలేకరులకు తెలిపారు. నిందితుడిని రాజోలు కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల పాటు రిమాండ్ విధించారన్నారు.

రత్నగిరిపై ఇద్దరు పురోహితుల సస్పెన్షన్

అన్నవరం: వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వ్రతాలాచరించే భక్తులను కానుకలు డిమాండ్ చేశారన్న ఆరోపణపై వ్రత విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు వ్రత పురోహితులను సస్పెండ్ చేశారు. ఈ మేరకు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. వ్రతాల సమయంలో గోదానం, భూదానం పేరుతో కానుకలు ఇవ్వాలని వ్రత పురోహితులు పెండ్యాల వీఆర్‌బీకే శర్మ (రాము), రాయప్రోలు శ్రీరామచంద్రమూర్తి డిమాండ్ చేశారని ఈ నెల 15, 22 తేదీలలో ఈఓకు భక్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చారు. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని నలుగురు సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు.

మద్యం దుకాణాలపై ప్రజాగ్రహం

ఏలేశ్వరం: కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన మద్యం పాలసీ ద్వారా దుకాణాల ఏర్పాటుకు లైసెన్సులు జారీ చేశారు. ఎక్కడైనా దుకాణాలు పెట్టుకోవచ్చనే నిబంధన ఉండడంతో జనావాసాల మధ్య ఏర్పాటు చేసేందుకు లైసెన్సుదారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాలు వద్దంటూ మహిళలు ఆందోళనలు చేస్తున్నారు. ఏలేశ్వరంలోని మెయిన్ రోడ్డును ఆనుకుని మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు వ్యాపారులు చర్యలు చేపట్టారు. దీన్ని నిరసిస్తూ శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ వద్ద స్థానికులు ఆందోళన చేశారు. అనంతరం కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.



ఏలేశ్వరంలో ఆందోళన చేస్తున్న స్థానికులు



గూడపల్లిలో మద్యం షాపు ముందు ధర్నా చేస్తున్న ప్రజలు

షాపు తొలగించాలి

మలికిపురం: గూడపల్లిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వద్ద శుక్రవారం ఆ గ్రామస్తులు ఆందోళన చేశారు. గ్రామంలోని ఆర్అండ్‌బీ రోడ్డు పక్కనే శివాలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఉన్నాయి. అక్కడికి సమీపంలోనే మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు మీదుగా పాఠశాల విద్యార్థులతో పాటు నాలుగు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. ఈ నేపథ్యంలో మద్యం దుకాణాన్ని వేరే చోటుకు మార్చాలంటూ గ్రామస్తులు ఆందోళన చేశారు. కొణిదెల శ్రీనివాసరావు, కుడిపూడి పండు, కొల్లి సుబ్బరాజు, పాటి సూర్యనారాయణ, కె.నానాజీ పాల్గొన్నారు

షాపును మార్చాలి

పి.గన్నవరం: స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో ఏర్పాటు చేసిన మద్యం షాపును మరో ప్రాంతానికి తరలించాలని ఆర్.ఏనుగుపల్లి, కె.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు శుక్రవారం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.



అమలాపురంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు

ఆయా గ్రామాల సర్పంచ్‌లు దొమ్మేటి పార్వతి, తోలేటి బంగారు నాయుడు, తోరం వీర వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీలు కొల్లే సూర్యనారాయణ, యాండ్ర విజయలక్ష్మి తదితరులు పి.గన్నవరంలో విలేకరులతో మాట్లాడుతూ పి.గన్నవరం నుంచి మూడు గ్రామాలకు వెళ్లే విద్యార్థినులు, మహిళలు ఏటిగట్టు సెంటర్‌లో ఆటోల కోసం వేచి చూస్తారన్నారు. ఆటో స్టాండ్ ఎదురుగా మద్యం షాపు ఉండడంతో విద్యార్థినులతో పాటు ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ఈ మేరకు అమలాపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్, కొత్తపేట ఎక్సైజ్ సీఐ, పి.గన్నవరం తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీఓ కేఎస్ ప్రసాద్‌తో పాటు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు.

యువతి కిడ్నాప్‌కు యత్నించిన 9 మందిపై కేసు

కొత్తపేట: తల్లి, సోదరుడితో కలిసి వెళుతున్న యువతిని దారిలో అడ్డగించి కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. ఆయన శుక్రవారం రాత్రి విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామానికి చెందిన దంగేటి వెంకటరత్నం అనే మహిళ ఈ నెల 20వ తేదీని తన కుమారుడి ద్విచక్ర వాహనంపై తన 22 ఏళ్ల కుమార్తెతో కలిసి అంబాజీపేట మండలం ముక్కామల గ్రామానికి వెళ్లింది. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా కొత్తపేట బోడిపాలెం వంతెన సమీపంలోని సాయిబాబా గుడి వద్ద వారిని కోరుమిల్లి గ్రామానికి చెందిన పోలిశెట్టి కృష్ణ, అతడి స్నేహితులు అడ్డగించారు. వెంకటరత్నం కుమార్తెను ప్రేమ కారణం చూపి కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారు. దీనిపై వెంకటరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫోరెన్సిక్ ల్యాబ్‌కు మృతదేహం భాగాలు

అన్నవరం: తొండంగి మండలం ఏవీ నగరం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ బత్తిన మధుబాబుది సహజ మరణం కాదని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఏవీ నగరం శ్మశానవాటికలో పూడ్చిన అతడి మృతదేహాన్ని శుక్రవారం తవ్వి బయటకు తీశారు. తుని ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఆ మృతదేహంలో ముఖ్యమైన భాగాలను తీసి వైద్య పరీక్షల కోసం విజయవాడలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. తహసీల్దార్ మురార్జీ, ఎస్సై జగన్‌మోహనరావు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. మధుబాబును అతడి భార్య శిరీష, ఆమె ప్రియుడు పీతల ప్రశాంత్ హత్య చేశారని మధుబాబు బంధువులు ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు.

కొబ్బరి మొక్కల నరికివేత

రౌతులపూడి: పి.చామవరం - పారుపాక సమీపంలోని గుండబోలు కోటేశ్వరరావుకు చెందిన భూమిలోని కొబ్బరి మొక్కలను స్థానిక టీడీపీ నాయకులైన సర్పంచ్ నందమూరి రాజా, అతడి అనుచరులు గుండబోలు అప్పన్నదొర, అరిగెల రవీంద్ర తదితర 25 మంది శుక్రవారం నరికివేశారు. దీనిపై కోటేశ్వరరావు రౌతులపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో అడ్డువచ్చిన వారిని చంపివేస్తామంటూ బెదిరించారని ఆయన తెలిపారు.

టోర్నమెంట్ విజేతగా రామచంద్రపురం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో రెండు రోజులుగా జరుగుతున్న ఇంటర్ కాలేజీయట్ బాస్కెట్ బాల్ మెన్ టోర్నమెంట్ కమ్ యూనివర్సిటీ టీమ్ ఎంపిక శుక్రవారంతో ముగిసింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలలోని అనుబంధ కళాశాలల నుంచి 13 జట్లు, 12 మంది వ్యక్తిగత క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. విజేతలుగా నిలిచిన జట్ల వివరాలను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ప్రకటించారు. మొదటి స్థానంలో రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రెండో స్థానంలో జి.మామిడాడలోని డీఆర్‌కే రెడ్డి కాలేజీ, మూడో స్థానంలో పెనుగొండ ఎస్‌వీకేపీ కళాశాల, నాలుగో స్థానంలో ఏలూరు సీఆర్ఆర్ కాలేజీ నిలిచాయి. ఈ జట్లలోని క్రీడాకారులకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 12 మందితో పాటు అదనంగా మరో నలుగురిని యూనివర్సిటీ టీమ్‌గా ఎంపిక చేశారు. వీరు వచ్చే నెల ఒకటి నుంచి ఐదు వరకు బెంగళూరులో నిర్వహించే సౌత్ జోన్ పోటీలలో పాల్గొంటారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎంవీఎస్ఎస్ మూర్తి, సెలక్షన్ కమిటీ సభ్యులు రైల్వే కోచ్ ప్రసాద్, బాపిరెడ్డి, పరిశీలకులు పీడీ రమణ (పీఆర్ కాలేజ్), కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ కె.బాల సత్యనారాయణ, డాక్టర్ బి.రామ్‌గోపాల్, డేవిడ్ పాల్గొన్నారు.



ట్రోఫీని అందుకుంటున్న రామచంద్రపురం జట్టు

చెల్లని చెక్కు కేసులో మహిళకు జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన మహిళకి ఏడాది జైలు, రూ.4.50 లక్షల జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. కాకినాడ చెందిన బత్తిన రాణి నుంచి వరిపల్లి రత్నమాల 2020లో రూ.4 లక్షలు అప్పు తీసుకున్నారు. బాకీ తీర్చేందుకు 2021లో రూ.4.50 లక్షల చెక్కు ఇచ్చారు. ఆ చెక్కును రాణి బ్యాంక్‌లో వేయగా బౌన్స్ అయ్యింది. దీంతో ఆమె కోర్టును ఆశ్రయించారు. రత్నమాలపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

కిరాణా వ్యాపారి మృతి

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్ చెరువు వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో రంగంపేట మండలం వెంకటాపురానికి చెందిన కిరాణా వ్యాపారి బోడెం నాగేశ్వరరావు (40) మృతి చెందాడు. ఆయన దసరాకు తన గ్రామంలో కిరాణా దుకాణం ప్రారంభించాడు. దానిలో సరుకులను కొనుగోలు చేయడానికి మోటారు సైకిల్‌పై రాజమహేంద్రవరం వెళ్లాడు. సరుకులను కొనుగోలు చేసి తీసుకువస్తుండగా వెనుక నుంచి అతివేగంగా వాహనం ఢీకొనడంతో మృతి చెందారు.